క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామికి సమర్పించడానికి వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి శేషవస్త్రం, అభిషేక సామగ్రిని మంగళవాయిద్యాల నడుమ తీసుకు వెళ్లి అభిషేకాలు నిర్వహించి శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ జీవో రద్దు చేయాలని వినతి

ఆనందపురం: మండలంలో పలు గ్రామాల్లో భూములు సేకరించడానికి జారీ చేసిన ల్యాండ్ పూలింగ్ జీవోను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఎం నాయకులు తహసీల్దార్ రామారావుకికు వినతి పత్రం సమర్పించారు. ముకుందపురం, శొంఠ్యాం తదితర గ్రామాల్లో పేదల సాగులో ఉన్న భూములకు సంబంధించి లబ్ధిదారులకు హక్కులు కల్పించాలని కోరారు. సీపీఎం జోన్ సెక్రటరీ మూర్తి, కమిటీ సభ్యులు కె.నాగరాణి, ఆర్.నరసింగరావు వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

విద్యుత్ వాహనాల్లో సాఫ్ట్‌వేర్‌పై వర్క్‌షాప్

కొమ్మాది: విద్యుత్ వాహనాల్లో అన్‌సిస్ సాఫ్ట్‌వేర్ ఉపయోగం, ఎలక్ట్రికల్ మిషన్ మోడలింగ్‌పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించింది. ప్రొఫెసర్ సీహెచ్ విజయశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమేపీ పెరుగుతోందన్నారు. వివిధ విభాగాల మధ్య ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాలు కలిసి పరిశోధనలు జరపడం విద్యుత్ వాహన రంగంలో నూతన ఆవిష్కరణలకు దారి తీస్తుందని అన్నారు.

కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టుపై సదస్సు

కొమ్మాది: రుషికొండలోని గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్టులపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ పాల్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో వివిధ అంశాలపై కలుగుతుందన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు సామాజిక రుగ్మతలు, ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. పలు సమస్యలను ప్రభుత్వానికి ఎలా నివేదించాలో తెలుస్తుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రజిని పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 7వ వార్డులో రు.78.78లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డులో రూ.78.78లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. పిలకవానిపాలెంలోని వాంబేకాలనీ, దుర్గానగర్‌లలో రూ. 30.72లక్షలతో పార్కుల అభివృద్ధి, చంద్రంపాలెం, కళానగర్, పాత పీఎంపాలెంలలో రూ. 48.06 లక్షలతో సీసీ కాల్వలు, డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే దుర్గానగర్‌లో 30 ఏళ్లుగా ఎవ్వరూ పట్టించుకోని పార్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి అభివృద్ధి చేస్తున్నారని శ్రీ దుర్గానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పి. నాగేశ్వర రావు, వినయ్, శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

రూ. 61కోట్లతో సంక్షేమ పథకాలు

అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 7వ వార్డులో రూ. 61కోట్లతో 23 రకాల సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. 3, 300మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కూడా ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, 7వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, కల్చరల్ విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎం పాత్రుడు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, జెడ్సీ కనకమహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఏఈ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీలు పనిచేయలేదని ఆందోళన



థియేటర్ నుంచి బయటకు వచ్చి ఆందోళన చేస్తున్న ప్రేక్షకులు

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్‌లో శుక్రవారం మ్యాట్నీ షోలో ఏసీలు పనిచేయలేదని ప్రేక్షకులు ఆందోళన చేపట్టారు. దీంతో యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఈ సందర్భంగా పలువురు ప్రేక్షకులు మాట్లాడుతూ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఆదిపురుష్ సినిమాకు రెట్టింపు ధర పెట్టి వస్తే ఏసీలు పనిచేయక ఇబ్బందులు పడ్డామన్నారు. థియేటర్‌లో వసతుల లేమిపై భీమిలి ఆర్డీవో, తహసీల్దార్లకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఒక వర్గం ప్రేక్షకులు ఉద్దేశపూర్వకంగా తమపై బురద చల్లుతున్నారన్నారు. అస్తమానం డోర్లు తెరచి ఉంచడం వల్లే కూలింగ్ లేకుండా పోయిందన్నారు. ఏసీ టెక్నీషియన్లు వచ్చి చూసి అంతా బాగుందని చెప్పారన్నారు. థియేటర్ ఆస్తులకు నష్టం కలిగిస్తారనే ముందుచూపుతో భీమిలి పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల జోరు



సంతపేట అంబేద్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో అడ్మిషన్ల కోసం వచ్చిన తల్లిదండ్రులు

తగరపువలస: భీమిలిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు, విద్యార్థులు క్యూ కడుతున్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల ఆధునికీకరణ, వసతుల కల్పన, అమ్మ ఒడి ద్వారా తల్లుల ఖాతాల్లో రూ.15వేల జమ, ఉచితంగా జగనన్న విద్యాకానుక, పౌష్టికాహారంతో కూడిన జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అమలు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరుగుతున్నాయి. మరో పది రోజుల వరకు ఈ అడ్మిషన్ల జోరు కొనసాగుతుందని సంతపేట అంబేద్కర్ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.జగన్నాథస్వామి తెలిపారు.

వడగాడ్పులకు జనం విలవిల



ఖాళీగా అంబేద్కర్ కూడలి రోడ్డు

తగరపువలస: వడగాడ్పులకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంటిపై ట్యాంకుల నుంచి వస్తున్న నీరు కూడా భరించలేని వేడిగా ఉంటుంది. ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు, చివరకు ఏసీలు కూడా వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించలేకపోతున్నాయి. రోడ్లపై జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. కూల్ డ్రింక్స్, జ్యూస్ దుకాణాలకు కూడా పగలంతా జనం రావడం లేదు. ఎండ కారణంగా చిన్న చిన్న పనులు సైతం వాయిదా వేసుకుంటున్నారు. ఆటోలు, బస్సుల్లో రద్దీ తగ్గిపోయింది.

వికసించిన ఫ్లేమింగ్ టార్చ్



స్థానిక రాణిచంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనంలో అరుదైన ఫ్లేమింగ్ టార్చ్ పుష్పం విరబూసింది. బిల్‌బెర్జియా పిరమిడాలిస్‌గా వ్యవహరించే ఈ పుష్పం ఎంతో ఆకట్టుకుంటోంది. పార్కును సందర్శించే విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తోంది.

\- ఏయూ క్యాంపస్

ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలి



పిలకవానిపాలెంలో సంక్షేమ బావుటా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



సచివాలయ సిబ్బంది, గృహ సారథులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- గృహసారథులు, సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే ఆదేశాలు
- 7వ వార్డు పిలకవానిపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మధురవాడ: ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, అధికారులు మరింత చురుగ్గా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ 7వ వార్డులోని 82వ వార్డు సచివాలయం పరిధి పిలకవానిపాలెంలో శుక్రవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ ఇంటింటి కీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించి సంక్షేమ బావుటా పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ తాగు నీటి సమస్య పరిష్కారానికి బోరు నిర్మించాలని కోరారు. డ్రైనేజీలు సక్రమంగా నిర్వహించక దుర్వాసన, పందులతో ఇబ్బంది పడుతున్నామని తెలపడంతో తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అర్థం అయ్యే విధంగా చెప్పాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వంకాయల మారుతీ ప్రసాద్, పీకేఎం పాత్రుడు, జెడ్సీ కనక మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాలు నాయకులు పోతిన శేషుబాబు, మగ్గూరి వెంకటరావు, శ్రీదేవి, రమణమూర్తి, జగ్గు పిల్లి నరేష్, పిల్లా సూరిబాబు, బంగారు ప్రకాశ్, బాగం స్వాతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



కృత్రిమ అవయవాలతో దివ్యాంగులు

పద్మనాభం: దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి అన్నారు. మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలోని స్మృతి వనంలో శుక్రవారం గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, గాయత్రీ వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ , రూపాకుల విశాలక్ష్మి ట్రస్ట్ సంయుక్తంగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం పెన్షన్లు, బ్యాంకు రుణాలు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టు తెలిపారు. స్వామి సాయి దత్త లోకేశ్వరానంద మహారాజ్ మాట్లాడుతూ దివ్యాంగులకు మనోధైర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా 72 మంది దివ్యాంగులకు వీల్ చైర్లు, క్లచ్చెస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవి కుమార్, మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణ మూర్తిరాజు, బీజేపీ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, పి.కృష్ణారావు, ఉప్పాడ అప్పారావు పాల్గొన్నారు.

నాలుగు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ట్రయల్ రన్

పద్మనాభం: మండలంలో రీసర్వే పూర్తయిన నాలుగు గ్రామాల్లోని సచివాలయాల్లో ఈ నెల 20 వరకు క్రయ విక్రయాలు జరుపుకొన్న భూములకు ట్రయల్‌రన్‌గా రిజిస్ట్రేషన్లు చేయనున్నట్టు తహసీల్దార్ తోట శ్రీవల్లి తెలిపారు. బుడ్డివలస, బుడ్డివలస అగ్రహారం, తిమ్మాపురం, చిన్నాపురం గ్రామాల్లో క్రయవిక్రయాలు జరిగిన భూములకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే వారు సంబంధిత గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ల కోసం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరరావును, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు చెందిన ఒకరిని నియమించినట్టు చెప్పారు.

నేడు ఆరు గ్రామాల్లో గ్రామ సభలు

రీ సర్వే చేయడానికి ముందస్తుగా ఆరు గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ తెలిపారు. మద్ది, బాందేవుపురం, పాండ్రంగి, కొవ్వాడ, గంధవరం, నరసాపురం గ్రామాల్లో ఈ సభలు నిర్వహించనున్నామన్నారు. ఈ సభల్లో రీ సర్వే నిర్వహణ గురించి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

'గీతం'ను సందర్శించిన నార్త్ ఈస్టర్న్ వర్సిటీ బృందం



చర్చల్లో పాల్గొన్న బృందం

కొమ్మాది: అమెరికాలోని బోస్టన్‌లో నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ బృందం శుక్రవారం గీతం డీమ్డ్ యూనివర్సిటీని సందర్శించింది. గీతం వర్సిటీతో సంయుక్త అధ్యయనాలు, బోధన, పరిశోధనల్లో పరస్పర సహకారానికి నార్త్ ఈస్టర్న్ వర్సిటీ ఆసక్తి కనబరిచిన నేపథ్యంలో ఈ బృందం గీతం అకడమిక్ ప్రొ వీసీ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సీహెచ్ విజయశేఖర్‌లతో సమావేశమైంది. ఈ సందర్భంగా నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ డీన్ కె. సాగర్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. పెద్ద సంఖ్యలో గీతం విద్యార్థులు బోస్టన్‌లోని తమ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు పొంది, పరిశోధనల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచడం గీతంతో సంయుక్త ఒప్పందాలు కుదుర్చుకునేందుకు దారి తీసిందన్నారు.

పగులుతున్న పైప్‌లైన్లు

తాగునీటి సరఫరాకు అంతరాయం



పగిలిన చిల్లపేట పైపులైన్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని పలు ప్రాంతాల్లో పైపులైన్లు తరచూ దెబ్బతింటున్నాయి. ఒక లైన్‌కు మరమ్మతులు పూర్తి చేయక ముందే మరో లైన్ పగిలి నీరు వృథాగా పోతుంది. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. వేసవి వేళ తాగునీరు సక్రమంగా సరఫరా కాక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిట్టివలస చావుల మదుం రోడ్డులో భీమిలికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్ తరచూ పగిలిపోతుంది. దీంతో పలుమార్లు మరమ్మతులు చేశారు. పైప్‌లైన్ పగిలినచోట పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇటీవల ఇదే గొయ్యి పక్కన చిల్లపేటకు సరఫరా అయ్యే మరో పైపులైన్ పగిలిపోవడంతో చావుల మదుం రోడ్డు నీటితో నిండిపోయింది. పైపులైన్లకు మరమ్మతులు చేసేందుకు నీటి సరఫరా విభాగం సిబ్బంది రోడ్డును తవ్వి మరో గొయ్యి తీస్తున్నారు. దీంతో వాహనదారులకు కూడా అవస్థలు తప్పడం లేదు. వెలంపేట మీదుగా చుట్టూ తిరిగి చిట్టివలస కార్మిక వాడకు వెళ్తున్నారు. మరమ్మతులు చేసినా పైప్‌లైన్ దెబ్బతింటుందని.. కొత్త పైపులైన్ వేయాలని భీమిలి జోన్ ప్రజలు కోరుతున్నారు.

యోగాతో ఆరోగ్యానికి రక్ష



యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

మధురవాడ: ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురవాడ ఆయుర్వేద వైద్య శాల ఆధ్వర్యంలో శుక్రవారం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలు మజ్జి సుమ మాట్లాడుతూ యోగా సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రతీరోజు యోగా, ధ్యానం, ప్రాణాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చునని సూచించారు. యోగా అంటే జీవితాన్ని ఆధీనంలో ఉంచుకోవడం అని చెప్పారు. ప్రపంచానికి భారతదేశం అందించిన వరం యోగా అన్నారు. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని మధురవాడ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో యోగా శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీరుపేటకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



జీరుపేటలో లైన్లు సరిచేస్తున్న సిబ్బంది

తగరపువలస: భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేటకు శుక్రవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గురువారం రాత్రి విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రమాద విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు జీరు వెంకటరెడ్డి చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించారు. ఏఈఈ బొట్టా రవి ఆధ్వర్యంలో పనులు చేపట్టి శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

కాలిపోయిన గృహోపకరణాలు

గురువారం రాత్రి లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటనలో సరఫరా హెచ్చుతగ్గులకు లోనై జీరుపేటలోని పలు ఇళ్లల్లో విద్యుత్ గృహోపకరణాలు కాలిపోయాయని బాధితులు వాపోయారు. లారీ సిబ్బంది నుంచి నష్టపరిహారం వసూలు చేయాలని ఆందోళన చేపట్టారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

మధురవాడ: ఈగలు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కె. కనకమహాలక్ష్మి చెప్పారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. 7వ వార్డు కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, 7వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పద్మనాభం: మండలంలోని కోరాడ సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులు పరిశీలించారు. రికార్డులు అప్‌డేట్‌గా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు సూచించారు.

ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు!

మండల కేంద్రం ఆనందపురంలో పరిస్థితి



రోడ్డుపై నిలిపివేసిన వాహనాలు



ఎదురెదురుగా వచ్చిన వాహనాలు తప్పుకోవడానికి ఇక్కట్లు ఇలా..

ఆనందపురం: మండల కేంద్రమైన ఆనందపురం ప్రధాన రహదారి ఇరుగ్గా ఉండడంతో వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. రెండు వాహనాలు ఒకే సారి ఎదురెదురుగా వస్తే తప్పుకోవడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. ఇక్కడ రోడ్డు కేవలం 10 అడుగుల వెడల్పు మాత్రమే ఉంది. దీంతో ఈ మార్గంలో పెద్ద వాహనాలు రాకపోకలు సాగించడానికి అవకాశం లేకుండా పోతోంది. గతంలో ఈ రోడ్డును విస్తరించాలని ప్రతిపాదించినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రధాన రహదారిని ఆనుకునే యూనియన్ బ్యాంక్, సహకార సంఘం, మద్యం షాపు, పాఠశాలలు ఉన్నాయి. వివిధ అవసరాలపై అక్కడికి వచ్చేవారు పార్కింగ్ స్థలం లేక రోడ్డు పైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. ఆ వాహనాలు తీసే వరకు ఆ రూట్లో రాక పోకలకు అవకాశం లేకుండా పోతోంది. ఇక్కడకు సమీపంలో పందలపాకలో పోలీస్ బెటాలియన్ ఉంది. అక్కడ సిబ్బంది కూడా రాకపోకలకు ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యం అవసరం



తాటితూరు హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందిస్తున్న సర్పంచ్ సంతోషి

తగరపువలస: విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని తాటితూరు సర్పంచ్ శిరిగుడి సంతోషి ఆకాంక్షించారు. భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ శిరిగుడి సంతోషి చేతుల మీదుగా విద్యార్థులకు శుక్రవారం జగనన్న విద్యా కానుకల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం, ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో 500 మార్కులు దాటిన ప్రతీ విద్యార్థికి రూ.1000 వంతున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొయ్య రమేష్ ప్రకటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కొయ్య శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, సచివాలయ కార్యదర్శి శంకర్ జగన్నాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు గురునాయుడు, మేడ నాని, కొసన పోలిరెడ్డి, బోని కనక, బోయి అప్పలరాము, మేడ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.